
# అప్పుకు

కామాక్షమ్మగారు పెంకుటింటి ముందు నడుం వంచి నిలబడితే, ఆవిడ నుదిటిని వైధవ్యం, కళ్ళని నైరాశ్యం కొట్టొచ్చినట్టు కనబడతాయి. ఆవిడనీ, యిద్దరు పిల్లల్నీ వదిలేసి ఆవిడ నుదుటి బొట్టు తీసుకున్నందుకు గాను ఈ లోకం విడిచి వెళ్ళిపోయిన ఆవిడ మొగుడు నెల నెలా నూటయాభై రూపాయలు ప్రభుత్వం చేత యిప్పిస్తున్నాడు. రామారావు - రాధలు, మొగుడితో కామాక్షమ్మ అనుభవాల ఆనందాల పంటలు. రామారావు పెద్దవాడైనా వాడికి పెద్దరికం లేదు. రాధ యవ్వనంలో ఉన్నా రాధ దగ్గర యవ్వనం లేదు. ఇద్దరూ రెండు అస్థిపంజరాలకి తొడిగిన రెండు చర్మపు సంచులు, తిన్నగా తిండి లేని తనువులు.

వాళ్ళ వీధిలో అన్నీ పెంకుటిళ్ళే! ఇళ్ళన్నీ నడుములు వంచుకు ఉంటాయి. పెణకలు కాకులు పీకేయడం వల్ల చెల్లా చెదరై ఉన్న పెంకులతో గారబట్టి, నల్లగా నాచుపట్టి, ఆకు పచ్చగా అసహ్యంగా ఉంటాయి. అదిగో, దానిముందు వీధిలో రీయిన్ ఫోర్స్‌డ్ కాంక్రీటుతో కట్టిన ఇళ్ళేమో రొమ్ము విరుచుకుని నిలబడి ఉంటాయి. సెల్యూట్ పుచ్చుకుంటున్న నియంతల్లా ఉంటాయి. ఆ వీధిలో విదేశాల నుండి దిగుమతి చేసిన మత్తు పారితే ఈ పెంకుటిళ్ళ వీధిలో చాలీచాలని జీవితాల కన్నీళ్ళు కారుతాయి. కామాక్షమ్మగారి పెంకుటిల్లు రాలీరాలని కన్నీళ్ళతో చెమరుస్తూ కనబడుతుంది.

రామారావు నా క్లాసుమేటు. రాధ నాకు ఫ్రెండు. అదీ, నేనూ రోజూ ట్రైపుకు వెళ్తూ ఉంటాం. నే వెళ్ళేసరికి వాళ్ళమ్మ చింకి విసన కర్రతో బొగ్గుల పొయ్యి విసురుతున్నాది. నుసి అయిపోయిన కాగితం ముక్కలు గది మూల ఎగురుతున్నాయి - ప్రాణాన్ని లాక్కుని కాలం బతుకుల్ని బుగ్గి చేస్తున్నట్లు!

"ఉండు బాబూ! రాధా వచ్చేస్తున్నాది. కాఫీ తాగి వెళ్ళిపోదురుగాని!" అన్నది



కామాక్షమ్మగారు.

"నేనిప్పుడే తాగేనండీ! నాకొద్దు!" అన్నాను.

"కాఫీకేముంది? ఎన్ని సార్లయినా తాగొచ్చు!" అన్నది రాధ జడ కొసని రబ్బరు బాండు పెట్టుకుంటూ.

నిజమే. ఎన్ని సార్లయినా తాగొచ్చు కాఫీ! అయితే కామాక్షమ్మ గారింటి కాఫీ తాగితే మాత్రం తాగిన గంట దాకా నాలికని పీకి పారేసుకోవాలనిపిస్తుంది. అంతవరకూ నాలికని పట్టిన కాఫీ వదిలి పెట్టదు. ఏం చెయ్యడం? ఆవిడిచ్చిన కాఫీ విషంలా రెండు గుక్కలు వేసి వాళ్ళెవరూ చూడకుండా కిటికిలోంచి విసిరేశాను. నా ప్రాణం చివుక్కుమంది. విషంలా ఉన్నా వాళ్లు అమృతంలా తాగుతున్నారు! ఆప్యాయతతో యిచ్చిన కాఫీ,

వాళ్ళకీ కాక, నాకూ కాక కిటికీ అవతల నేలపాలు అయింది.

రాధ ట్రైపు బాగానే చేస్తున్నాది. చేతిలో విద్య లేకపోతే బతుక్కి అవకాశాలు ఉండవు. అందుకే పట్టుదల రాధలో కనబడుతున్నాది. వాళ్ళన్నయ్య ఉద్యోగంలో చేరేదెప్పుడు, చేరి డబ్బు కూడబెట్టి పెళ్ళి చేసేదెప్పుడు? అన్నయ్య తనకి పెళ్ళి చేస్తానంటూ ఉండడం కలేకాని నిజం కాదు. వీళ్ళతో వాళ్ళతో రాసుకు పూసుకు తిరిగి చివరికి ఎవరినో ఒకరిని తనకి తాను కట్టుకునే చొరవా, సాహసం అంతకన్నా లేవు. రాధ తన మాటల్లో "నేను పెళ్ళి చేసుకోను. ఉద్యోగం చేస్తాను" అని అంటూ ఉంటుంది. దాని మొహంలో అన్న పెళ్ళి చేయలేడనీ, తానేదో ఉద్యోగం చేసుకుని తన బతుకు తను బతక్క తప్పదనే భావం స్పష్టంగా కనబడుతుంది. అందుకే దైన్యంగా వంగిపోయి, ముడుచుకు పోయి, ఆర్చుకుపోయి కనబడుతుంది. దాని మొహంలో ఉన్న అందాన్ని లోపల నిలవైపోయిన విచారం గ్రహణంలా పట్టుకుని రోజు రోజూ కాస్తంత తినేస్తోంది.

నేను రోజూ అంత చనువుగా వాళ్లింటికి వెళ్తూ ఉంటాను. రాధకి ఈడూజోడూ అయిన కుర్రాణ్ణి. రాధని నేను చేసుకుంటానేమోనన్న ప్రయత్నం వాళ్ళు చెయ్యొచ్చు. కాని ఆ అభిప్రాయం కామాక్షమ్మ గారిలో గాని రామారావులో గాని ఏ కోశానా కనపడదు. రాధలో ఆ భావం ఉన్నట్లే లేదు. నేనున్నది వాళ్ళ వీధి కాదు. సిమెంటు కాంక్రీటు మేడల వీధి. ఆ గర్వం, దర్పం నాలో లేకపోయినా నేను వాళ్ళకి అందని వాణ్ణి. అందుకే వాళ్ళలో ఆ ఊహలేదు. వెలితిపడి మాట అనడమే గాని అది జరిగేది కాదని వాళ్ళ నిశ్చయంలా కనపడుతుంది.

రాధకు తనకున్న దాంట్లోనైనా షోకు చెయ్యడం రాదు. అందుకే అందమైనదైనా దాని జోలికి ఎవరూరారు. దాన్ని అల్లరి చెయ్యరు. పకోడీ నోరూరించినట్లు రంగైనాలేని మిఠాయివుండని చూస్తే నోరూరదు. మా అందరి మధ్యా రాధ అలాగే ఉంది. సన్నిహితత్వం ఎక్కువైన కారణం చేతో ఏమో నా మనస్సుకి మాత్రం రాధ రుచివంతంగానే కనబడుతుంది. ఇద్దరం రోజూ కలిసే ట్రైపుకి వెళ్తాం. కలిసే ట్రైపు నుంచి వస్తున్నాం.

బతుకూ, బాధ్యతలూ తెలిసిన వాళ్ళైనా రామారావుకి పాపం సెకండ్ క్లాసే వచ్చింది. వాడు కష్టపడ్డంలో లోటులేదు. వాళ్ళింటికి వెళ్ళి "ఒరేయ్! సెకండ్ క్లాసులో పాసయ్యావు! స్వీటు ఏదీ!" అని రామారావుని అడిగేను.

"అన్నయ్య పాసయిందుకు బెల్లంముక్క పెడతాను. నీకు ఫస్టుక్లాసే వచ్చింది. నువ్వేం తెచ్చావు!" అన్నది రాధ.

"నేన్నీకు తియ్యటి మాట పట్టుకు వచ్చేను" అని మనస్ఫూర్తిగా చెప్పేను. నా మనస్సులో ఉన్న తియ్యటి మాట వాళ్ళెవ్వరికి తెలీలేదు. తెల్సుకోలేని స్థితిలోనే ఉన్నారు.

"మాట ఎంత తియ్యటిదైనా బెల్లమ్ముక్క పాటి చెయ్యదు." అన్నది రాధ.

మాట ఎబ్‌స్ట్రాక్టు. బెల్లమ్ముక్క కాంక్రీటు. నామాట యాబ్‌స్ట్రాక్టు అయినా కాంక్రీటు అయేస్థితిలో ఉంది. అప్పుడు దాని విలువ ఎంతో బోధపర్చుకునే స్థితిలో రాధ లేదు. నా మాటల్లో ఏనాడూ అది ద్యోతకమూ కాలేదు. ఈ 'తీపి మాట'లో ఒక్కటే నేను భావం స్ఫురింపచేశాను. అప్పుడు చెప్పి ప్రయోజనం లేదు. నాకు నేను నిలబడ్డ నాడు కాని రాధమీద నా అభిప్రాయం చెప్పి ప్రయోజనం లేదు.

"టైపుకి వస్తావా?" అన్నది రాధ.

"ఇవాళ వస్తాను కాని ఇంక రాను. మా అక్క బావగార్ల దగ్గరకిపోతాను. అక్కడ పి.జి సెంటర్లో చేరాలనుకుంటున్నాను." అని నా ముందు ప్లాను చెప్పేను.

"టైపు, షార్టు హేండు నేర్చుకోటం నాకు మాత్రం తప్పవు." అన్నది రాధ.

రాధ టైపు షార్టుహేండు కూడా లోయరు పరీక్షలు పాసయింది. హయ్యరుకు కష్టపడి కృషి చేస్తున్నాది. రామారావు చదువు అక్కడితో సరి. ఇహ వాడు ఉద్యోగ ప్రయత్నం చేస్తాడు.

మా అక్కయ్యగారి ఊరు వెళ్లేను. రంగురంగుల దృశ్య చిత్రాలు కొన్ని వందల కిలోమీటర్ల ప్రాంతం రైల్లో దాటితే మా అక్కయ్యగారి ఊరు. తోవ పొడుగునా రంగు రంగుల ఛాయల్లాగ ఊళ్లు! తోవ పొడుగునా ఉన్న పొలాలన్నీ కలిగున్న వాళ్ళకి పంపకమై ఉన్నాయి. ఊళ్ళలో ధనికుల ఇళ్ళు నిటారుగా కనబడుతున్నాయి. పేదల గూళ్ళు కూలివాళ్ళ బతుకుల్ని చెపుతున్నాయి. పి.జి. సెంటర్లో నాతోపాటు చేరిన విద్యార్థులంతా నాకన్నా ధనికులే ఉన్నారు. పెంకుటిళ్ళ వాళ్ళెవరూ పి.జి.సెంటర్లో చదువుతున్న వాళ్ళలో లేరు. ఇక గుడిసెల వాళ్ళా! వాళ్ళ చదువులు గుణింతాల దగ్గరే ఆగిపోతున్నాయి. పి.జి. సెంటరుకి వెళ్తే ఇది స్పష్టంగా తెలుస్తున్నది.

కింద చదువుల్లో రాధ నన్ను కరుణతో ఆకర్షించింది.. ఆ ఆకర్షణ నిలకడగా నిలిచిపోయే ఉంది. పి.జి సెంటర్లో ఉన్న కుర్రాళ్ళందరి మీదా "రాజ్యం" రాజ్యమేలేస్తున్నది. కోసుకుని పట్టుకుపోవాలనే కోరికల పువ్వులా వికసించి మా అందరి మధ్యా రాజ్యం పరిమళాలు వెదజల్లు తున్నది. మమ్మల్ని ఆకర్షిస్తున్నది. రాజ్యం సుళువుగా అందరితోటీ మాట్లాడుతుంది. నాతో మరీను! అందరూ దానికోసం ఆరాటపడితే అది నా కోసం ఆరాటపడుతున్నది. క్లాసులో మాస్టారువేసిన విట్టుకి అందరూ నవ్వుతూంటే రాజ్యం

నావేపు తిరిగి మరీ నవ్వుతుంది. దాని గురించి నాకేమీ తెలీదు. అదెవరో గట్రా నేనేం ఆరా తియ్యలేదు. దాంతో మాట్లాడ్డానికి నాకే బిడియం. నా బిడియాన్ని కప్పెట్టుకుని మాట్లాడ్డానికి ప్రయత్నించవల్సి వస్తూ ఉంటుంది. రాజ్యం నేనెవరో, మా నాన్నెవరో ఎలాగ తెలుసుకుందో, ఎవర్నడిగి తెలుసుకుందో కాని తెలుసుకుంది.

"గొప్ప బోరింగుగా ఉన్నాయి దిక్కుమాలిన క్లాసులు!" అన్నది రాజ్యం.

"మానేసి ఇంటికి పొండి" అన్నాను.

"మా అన్న అమెరికాలో చాలా పెద్దవాడు. పోస్టు గ్రాడ్యుయేటు అయితే తీసుకెళ్తానన్నాడు. అందుకోసం పోస్టు గ్రాడ్యుయేటు అవక తప్పదు. వెధవ ఖర్మ!"

"మీ అన్నయ్య అమెరికాలో ఏం చేస్తున్నారు?"

"చెప్పను. చెపితే ప్రమాదం. ఇక్కడ ఫ్రెండ్సంతా నన్ను పట్టుకుంటారు. మనం పోస్టు గ్రాడ్యుయేట్లం అయితే మా అన్నయ్య వెంటనే అమెరికాలో మనకి 'పుట్టింగ్' ఇవ్వగలడు. ఈ విషయం కూడా, ఎవరికీ చెప్పకండి" అన్నది రాజ్యం.

రాజ్యం తనతోపాటు నన్ను కూడా అమెరికా ఎత్తుకుపోడానికి సిద్ధంగానే ఉన్నాది. పి.జి కోర్సు బాగానే సాగుతున్నాది. రాజ్యం కాలేజీలో అందరి మీదా రాజ్యం చేస్తున్నా నాకు మాత్రం రోజురోజుకీ అసహ్యమే ఎక్కువవుతున్నాది. డబ్బున్న వాళ్ళ విరగబాట్లన్నీ దానికున్నాయి. దాని కృత్రిమపు భావాలంటే నాకు ఒళ్ళు మంట. అదీ, దాని గీర ఇంట్లో మా బావకీ, అక్కకీ చెప్పుకోడానికే నాకు సరిపోతున్నది. మా బావకి ఆ పిల్లెవరో తెల్సు, దాని అన్నదమ్ములెవరో తెల్సు.

"దాన్ని బుట్టలో వేసేవా, నువ్వు చాలా పెద్దవాడివైపోతావు!" అన్నాడు మా బావ.

రాజ్యాన్ని నేను బుట్టలో వెయ్యడం ఏమిటి? సాలెపురుగులాగ పట్టునేసి దాని గూట్లో నేనెప్పుడు పడతానా అని అది చూస్తున్నాది. ఆ విషయం నేనింట్లో ఛస్తే చెప్పలేదు.

నా మనస్సు రాధ మీద లగ్నమైపోయే ఉంది. రాధకీ, రాజ్యానికీ ఇద్దరికీ తేడా లైపారు వేస్తే మొగ్గు ఎప్పుడూ రాధ వేపే పోతున్నది. "రాధని నేనుద్ధరిస్తే..." అని ఓ వాక్యం రాసుకుని దానిమీద పేజీలకి పేజీలు ఆలోచనలు అల్లడం అలవాటు చేసుకున్నా.

మధ్య మధ్య మా ఊరు వెళ్తూనే ఉన్నాను. జారిపోయిన పెణక కింద బతుకుతున్న కామాక్షమ్మ గారింటికి వెళ్తూనే ఉన్నాను. వాళ్ళు ఆప్యాయతతో మాట్లాడుతున్నారు. వాళ్ళ ఇబ్బందులూ చెప్తున్నారు. నేనుద్యోగం చేసి ఆ ఇంటిని ఉద్ధరించాలనే

అనుకుంటున్నాను. ఆ పెంకుటింటి మీద సిమెంటు స్లాబ్ వేయిద్దామనే అనుకుంటున్నాను.

నే పండగ సెలవలకి వెళ్తే వాళ్ళిల్లు కాస్త కలకలలాడుతూ కనపడ్డది. రామారావు తాలుకా ఆఫీసులో గుమాస్తాగా చేరేడు. దాంతో వాళ్ళింటి పరిస్థితి చాలా మారినట్టే ఉన్నది.

నే వేసంగి సెలవలకి యింటికెళ్తే వాళ్ళ పెంకుటిల్లు చింతగింజల్లా ఉన్నది, చక్కగా వెల్లవేసిన ఆ యింటి గోడల మీద సూర్యకిరణాలు "బంగారం పూత' పూస్తున్నాయి. గదిలో వారగా ఓ స్టీలు టేబిలు, దానిమీద ఆకుపచ్చ రెక్సిన్‌క్లాత్, దీర్ఘ చదురస్రంగా ఉన్న రేడియో, పైన గోడమీద అందమైన బేటన్ వైరింగు, తలెత్తితే సీలింగు మీంచి వేళ్లాడుతూ 'కూల్ హోమ్' ఫేను. కొత్త చాపవేసి నేసిన పెణక కొత్త బట్టలు కట్టుకున్నట్లుంది. రాధ కాలేజీలో చదువుకుంటున్నది. కామాక్షమ్మ గారు చిక్కటి ఫిల్టర్ కాఫీ యిచ్చేరు. రాధకి పెళ్ళి సంబంధం చూడమన్నారు. ఐదువేలు కట్నం యిస్తామనీ, తగిన వాణ్ణి చూడమనీ!! రాధ మొహంలో పూర్వపు దైన్యం కనపడ్డం లేదు. ధీమాగా నాకేమనే ఉన్నది.

"రాధకి పెళ్ళి చెయ్యడం ఇంక మీకేం కష్టం లేదు. అయితే పెళ్ళి కొడుకుని చూసే పూచీ తప్పకుండా నామీదే పెట్టండి" అని చెప్పేను.

వాళ్ళందరూ నన్ను మిత్రుడిగా పూర్వపు గౌరవంతోనే చూస్తున్నారు. ఆ ఇంటికి వెళ్తే స్వంత ఇంట్లో ఉన్నట్లే నా కనిపిస్తూ ఉంటుంది.

నేను పి.జి సెంటర్లో ఉండగా శ్రావణ మాసంలో రామారావు పెళ్ళి శుభలేఖ వచ్చింది. వాడి పెళ్ళికి వెళ్ళవల్సిందే! వెళ్ళడానికి సావకాశం కాలేదు. గ్రీటింగ్స్ మాత్రం పంపించేను. ఓ టెలిగ్రాం. అంతే! నేను మళ్ళీ పండక్కి కూడా మా ఊరు వెళ్ళలేదు. మా అమ్మా, నాన్నా అంతా మా అక్కయ్యగారింటికే వచ్చేరు.

నేను మా ఊరు వెళ్ళడం మళ్ళీ వేసంగికే! సంవత్సరంలో కామాక్షమ్మగారి ఇల్లు మరీ మారి పోయింది. నమ్మశక్యం కాదు. రామారావుకి పాతిక వేలు కట్నం యిచ్చి పిల్లనిచ్చి పెళ్ళి చేసేరు. చాలా పెద్దింటి వాళ్ళు. వాడికి పిల్లనిచ్చి పెళ్ళి చెయ్యటమే కాదు, వాడి చెల్లెలు రాధకి కూడా తగిన సంబంధం చూస్తామని వాళ్లు పూచీ పడ్డారు. చిన్న లోటు ఉంది. పెళ్ళి కూతురికి ఓ కాలు బాగా అవుకు. పదో క్లాసుదాకా చదివిందట. రామారావూ, కామాక్షమ్మగారూ సరిపెట్టుకున్నారు. ఒక్క అంగలో పెద్ద బతుక్కి చేరుకున్నారు. రాధకీ, కామాక్షమ్మగారికీ చెరి వెయ్యిన్నూట పదహార్లు ఆడబడుచు లాంఛనం, వియ్యపురాలి కట్నం ఇచ్చేరు. రాధకి పట్టుచీర పెట్టేరు. అంపకం బట్టలు.

రాధ చీర తీసుకువచ్చి చూపెట్టింది. రాధ మొహంలోగర్వం యింతా అంతా కాదు. ఆ గర్వం కామాక్షమ్మగారిలోనూ కనపడ్డాది.

"పెళ్ళికి నువ్వొచ్చేవు కాదు. నువ్వు తప్పకుండా వస్తావనుకున్నాం" అన్నది రాధ.

"తప్పకుండా వచ్చేవాణ్ణి. కాని ప్రాక్టికల్సు పోతాయని రాలేకపోయేను" అన్నాను.

"పెళ్ళికి నువ్వు రావల్సింది. చాలా ఘనంగా చేసేరు. నువ్వొస్తే చాలా సంతోషించేవాడివి!' ' అన్నది రాధ.

కామాక్షమ్మగారు 'రాధకి పెళ్ళి సంబంధం చూసేవా' అని అడగడం అడిగేరు. తప్పకుండా చూస్తానని నేననడమూ అన్నాను. అయితే రామారావు అడ్డంగా వచ్చి చెల్లెలి పెళ్ళి విషయం నేనేం చూడాలో కూడా చెప్పేడు. ఇంజనీరింగు చదువుతున్నవాడు కాని, యం.బి.బి.యస్. చదువుతున్నవాడుకాని కావాలని కోరేడు. వాడు చెప్పింది నాకు ఆశ్చర్యంగానే ఉంది.

"ఏం కాలేజీలో పని చేసే ఓ జూనియర్ లెక్చరర్‌ని చూస్తే చాలదా?" అని అడిగేను. కాలేజీ లెక్చరరు కావాలనే నా జీవితాశయం.

"వాళ్ళు పాపం యు.జి.సి. స్కేల్సు కావాలని కోరుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు యివ్వలేమంటున్నారు. ఇచ్చినా నా పాటి ఆదాయం కూడా వాళ్ళకి ఉండదు. చూస్తున్నానుగా ఈ ఊరి లెక్చరర్లని, వాళ్ళ బతుకుల్ని! నా దగ్గర తీసికట్టే. ఓ డాక్టరో, ఇంజనీరో అన్నావు, కాస్త మంచి బతుకు బతుకుతాడు" అన్నాడు రామారావు.

తాలూకా ఆఫీసులో రామారావు రెండుచేతులా గణిస్తున్నాడు. రెవెన్యూ వాడు. జలగలాగ రక్తం పీల్చేసి బతకడం నేర్చేసుకున్నాడు. అత్తవారి వంక కలసి వచ్చినవాడు. నా మీద వాళ్ళెవరికీ కోరిక లేదు. రాధకీ లేదు. రాధలో కూడా కావల్సినంత గీర పెరిగే ఉంది. రాజ్యానికీ, రాధకీ గీరలో చిన్న నిష్పత్తి తేడా మాత్రమే ఉంది!

రామారావు వాడి పెళ్ళాన్ని మాత్రం చూపించలేదు. నేను చూడలేదు. దాని కాలి అవుకు మన సమాజంలోని అవుకు. ఆ అవుకు కనపడుతూనే ఉందని యింటికి వెళ్ళిపోయేను.

*(తెలుగునాడు 16-30 సెప్టెంబర్ 79*

★